
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి 3 ములుగు
శనివారం 17 ఫిబ్రవరి 2024





మహాజాతరకు ఆర్టీసీ రెడీ

- రేపటి నుంచి ప్రత్యేక సర్వీసులు
- 6వేల బస్సుల్లో 35లక్షల మంది భక్తుల తరలింపే లక్ష్యం
- మేడారంలో 55ఎకరాల్లో తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు

శివసత్తుల పూనకం..
నిలువెత్తు బంగారం..

- మేడారం వనదేవతలకు భక్తుల ముందస్తు మొక్కులు
- జాతర సమీపిస్తుండటంతో పెరుగుతున్న రద్దీ



సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద భక్తుల కోలాహలం, జంపన్న వాగులో పుణ్యస్నానం

మేడారం, ఫిబ్రవరి 16 : మేడారం మహాజాతర ఘట్టానికి సమయం సమీపిస్తోంది. ఇప్పటికే నెలరోజులుగా భక్తులు ముందస్తు దర్శనాలు చేసుకుని మొక్కులు చెల్లించుకుంటుడగా.. శివసత్తుల పూనకాలు, నిలువెత్తు బంగారంతో వస్తున్న భక్తులతో మేడారం పరిసరాలు సందడిగా మారుతున్నాయి. రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతుండగా శుక్రవారం లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు చెబుతున్నారు. శివసత్తుల పూనకాలు, భాజాభజంత్రీలు, డోలు సన్నాయి మేళాలు, సమ్మక్క సారలమ్మలకు జేజేలతో పరిసరాలన్నీ హోరెత్తుతున్నాయి. వనదేవతల మొక్కుల్లో భాగంగా భక్తులు జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి కాలినడకన గద్దెలకు చేరుకుని.. పసుపు, కుంకుమ, చీర సారె సమర్పించి.. యాటమొక్కులు చెల్లించుకుంటున్నారు. నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పిస్తున్నారు. లక్షలాదిగా వస్తున్న భక్తులతో గద్దెల ప్రాంగణం, జంపన్నవాగు తీరం కిటకిటలాడుతుండగా.. భక్తుల తాత్కాలిక గుడారాలు, చిరువ్యాపారుల అంగళ్లతో మేడారమంతా జాతర సందడి కనిపిస్తోంది.

వనదేవతలను దర్శించుకున్న కేంద్ర మాజీ మంత్రి

మేడారం వనదేవతలు సమ్మక్క సారలమ్మలను కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్ కుటుంబ సమేతంగా తల్లులను దర్శించుకున్నారు. పూజారులు సాదరంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేశారు. పూలు పండ్లు, కొబ్బరికాయ, బెల్లం తల్లులకు సమర్పించారు. పూజారులు కండువాతో సన్మానించారు.

నేడు మేడారానికి నలుగురు మంత్రులు రాక

- ఏర్పాట్లను పరిశీలించిన ములుగు కలెక్టర్






మేడారం, ఫిబ్రవరి 16: మేడారం జాతరకు శనివారం నలుగురు మంత్రులు రానున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను శుక్రవారం ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. శనివారం మేడారంలో రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క పర్యటించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్ల గద్దెల ప్రాంగణం, మీడియా పాయింట్, హరిత హోటల్, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీపీవో వెంకయ్య, తహసీల్దార్ రవీందర్ తదితరులు ఉన్నారు.

టెన్త్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలి

విద్యాశాఖ జిల్లా అధికారి అబ్దుల్ హై



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో అబ్దుల్ హై

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 16: పదోతరగతి వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధనకు ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) అబ్దుల్ హై అన్నారు. ములుగులోని డీఈవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో ఆందోళనలను తొలగించి ప్రశాంతంగా పరీక్షలు రాసేలా ప్రధానోపాధ్యాయులు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. ప్రతినెలా మూడో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించి పదోతరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు సిద్ధమయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిజికల్ సైన్స్, బయోసైన్స్ ఫోరం ఆధ్వర్యంలో జరిగే సైన్స్ టాలెంట్‌టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటర్నల్ మార్క్స్ వెరిఫికేషన్ టీమ్స్ పాఠశాలల సందర్శన అనంతరం అప్రూవ్ అయిన తర్వాత మాత్రమే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీఈబీ కార్యదర్శి విజయమ్మ, సమగ్రశిక్ష కోఆర్డినేటర్లు బద్దం సుదర్శన్‌రెడ్డి, అర్షం రాజు, సాంబయ్య, రమాదేవి, ఏసీజీఈ జయదేవ్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఉద్యోగుల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 16: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద శుక్రవారం ఆందోళనకు దిగారు. భోజన సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు బురుగు రవి మాట్లాడుతూ సీపీఎస్ పెన్షన్ విధానం వల్ల రాష్ట్రంలోని 2 లక్షల ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఆదాయ పన్ను మినహాయింపు రూ. 10 లక్షలకు పెంచాలని అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలన్నారు. జీవో 370ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో టీఎన్జీవోలు, టీజీవో సంఘాల ఉద్యోగులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం

- భూపాలపల్లి జిల్లాలో ధర్నాలు, నిరసన ర్యాలీలు
- అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళనలు
- సంఘీభావం తెలిపిన కార్మిక, ప్రజా సంఘాలు

కాకతీయఖని, ఫిబ్రవరి 16: కేంద్ర ప్రభుత్వ విధానాలపై అఖిలపక్షం ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన భారత్ బంద్ భూపాలపల్లి జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ పార్టీలతోపాటు వ్యవసాయ, రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు జరిగాయి. కార్మిక సంఘాలు సంఘీభావం తెలిపాయి. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనల్లో పాల్గొన్నాయి. సింగరేణి బొగ్గు గనులు, డిపార్ట్‌మెంట్లలో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు సంఘీభావం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా బంద్ పాక్షికంగా జరగ్గా కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు స్వచ్ఛందంగానే బంద్ ప్రకటించాయి.



భూపాలపల్లిలో నిరసన తెలుపుతున్న అఖిల పక్షాల నాయకులు

ములుగు జిల్లాలో..

ములుగు : జిల్లాలో భారత్‌బంద్ సందర్భంగా నిరసన ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు జరిగాయి. వ్యాపార, వాణిజ్య సంస్థలు యథావిధిగా పనిచేశాయి. మేడారం మహాజాతర తేదీలు సమీపించడంతో జిల్లాలో జాతర హడావుడి నెలకొంది. అయితే వామ పక్ష, కార్మికవర్గాలు నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. సీపీఎం, సీపీఐ, ఏఐటీయూసీ, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ములుగులోని జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న కాం ట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.



ములుగులోని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు



భూపాలపల్లి ఏరియాలోని ఓసీ-3 వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

గ్రేహౌండ్స్ కమాండర్ మృతి కేసులో ముగ్గురి అరెస్టు

కాటారం, ఫిబ్రవరి 16: వన్యప్రాణుల కోసం విద్యుత్ ఉచ్చు బిగించి.. గ్రేహౌండ్స్ జూనియర్ కమాండర్ ఆడే ప్రవీణ్ మృతికి కారణమైన ముగ్గురు వ్యక్తులను భూపాలపల్లి జిల్లా కాటారం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. కాటారం పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను సీఐ నాగార్జునరావు వెల్లడించారు. కాటారం, ఇప్పలగూడేనికి చెందిన ఊదరి రమేష్, గోగుల రమేష్, గజ్జెల శ్రీనివాస్ కూలి పనులు చేసుకొనేవారు. వచ్చే డబ్బులు కుటుంబ అవసరాలకు సరిపోవడంలేదని భావించి వన్యప్రాణులను వేటాడి మాంసాన్ని అమ్ముకోవడం మొదలెట్టారు. అటవీ ప్రాంతంలో విద్యుత్ వైర్లు అమర్చి వన్యప్రాణులను వధిస్తున్నారు. అడవిలో చిన్న చిన్న కర్రలు పాతి వాటికి సెంట్రింగ్ వైరు బిగించి దానికి విద్యుత్ మెయిన్‌లైన్ (11 కేవీ) ద్వారా కనెక్షన్ ఇచ్చి వేటాడుతున్నారు. ఈ క్రమంలోనే ఈనెల 11న కాటారం శివారులోని అటవీ ప్రాంతంలో జాడి రమేష్ అనే వ్యక్తి పొలం వద్ద నుంచి బ్రాహ్మణవాగు అవతలివైపు ఉన్న అటవీప్రాంతంలో సుమారు రెండు కిలోమీటర్ల దూరం వైరుతో విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేశారు. కానీ అదే రోజు రాత్రి మావోయిస్టుల సంచారం ఉందనే సమాచారంతో 13 మందితో కూడిన గ్రేహౌండ్స్ దళం కాటారం అటవీప్రాంతంలో కూంబింగ్ నిర్వహించింది. ఆ రహదారిలో విద్యుత్ ఉచ్చు ఉందనే విషయాన్ని గ్రహించని జూనియర్ కమాండర్ ప్రవీణ్ దాని బారిన పడి షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీఐ నాగార్జునరావు నేతృత్వంలో ఎస్‌ఐ అభినవ్, హెచ్‌సీ శ్రీనివాస్, పీసీలు లక్ష్మీరాజు, హరికుమార్ నిందితుల కోసం గాలింపు మొదలెట్టారు. ఈ నేపథ్యంలో విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం రాత్రి ఊదరి రమేష్ ఇంటికి వెళ్లి చూడగా ముగ్గురు నిందితులు ఒకే చోట ఉండటంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. సులభంగా డబ్బు సంపాదించి కుటుంబ అవసరాలు తీర్చుకోవాలనే ఉద్దేశంతో విద్యుత్ ఉచ్చులు పెట్టినట్టు ఒప్పుకున్నారని సీఐ నాగార్జునరావు తెలిపారు. వారిని శుక్రవారం రిమాండ్‌కు తరలించామని సీఐ వెల్లడించారు. మృతుడు ప్రవీణ్ ఆదిలాబాద్ జిల్లా నార్నూరు మండలంలోని రాజోలిగూడ గ్రామ వాసి కాగా పోలీసు శాఖలో 2012 బ్యాచ్ కానిస్టేబుల్‌గా చేరాడు. గ్రేహౌండ్స్ జూనియర్ కమాండర్‌గా కొనసాగుతున్న ఆయన కూంబింగ్‌కు వెళ్లి విద్యుత్ ఉచ్చుకు బలయ్యాడు.



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసు అధికారులు

వేటాడితే కఠిన చర్యలు తప్పవు : డీఎస్పీ

వన్యప్రాణులను ఏ విధంగా వేటాడినా కఠిన చర్యలు తప్పవని కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. ఆన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వన్యప్రాణులతో పాటు విలువైన మనుషుల, పశువుల ప్రాణాలు బలిగొనడానికి విద్యుత్ ఉచ్చులు వేసే వారిపై నిఘా ఉంటుందన్నారు. ఇప్పటికే 15మందిని బైండోవర్ చేశామని తెలిపారు. మరికొందరిని అటవీ శాఖ సహకారంతో బైండోవర్ చేస్తామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.లక్ష జరిమానా, కఠిన చర్యలుంటాయన్నారు. ప్రవీణ్ మృతికి కారకులైన వారిని పట్టుకున్న సీఐ, ఎస్సై, సిబ్బందిని ఆయన అభినందించారు.

రామభక్తుల శోభాయాత్ర



ములుగులోని జాతీయ రహదారిపై శోభాయాత్ర నిర్వహిస్తున్న రామభక్తులు

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 16: రామభక్తుల శోభాయాత్ర ములుగులోని జాతీయ రహదారిలో శుక్రవారం ఘనంగా జరిగింది. డీఎల్ఆర్ ఫంక్షన్‌హాల్ నుంచి ప్రారంభమై తిరుమల థియేటర్ వరకు కొనసాగింది. బాలరాముడిని దర్శించుకొనేందుకు సీతారామాంజనేయస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు గండ్రకోట కుమార్ ఆధ్వర్యంలో 195 మంది భక్తులు అయోధ్యకు బయల్దేరారు. ఈసందర్భంగా భక్తులు జైశ్రీరామ్, భారత్‌మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. 500ఏళ్ల రామభక్తుల పోరాటానికి అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠతో హిందువుల చిరకాలవాంఛ నెరవేరిందని కుమార్ అన్నారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు జినుకల కృష్ణాకర్‌రావు, నాయకులు, రామభక్తులు దొంతిరెడ్డి రవిరెడ్డి, గాజుల కృష్ణ, శ్రీహరి, సుతారి సతీష్, సిరికొండ బలరాం, అల్లె శోభన్, గుగులోత్ స్వరూప, గాదం కుమార్, గంగిశెట్టి రాజ్‌కుమార్, సూర్యదేవర విశ్వనాథ్, బైకని సాగర్, ఇమ్మడి రాకేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

దేవుడా..!

కాళేశ్వరాలయంలో ఇష్టారాజ్యం

- గాడితప్పిన పాలన
- భక్తుల పట్ల చులకన భావం
- అర్చకులు, సిబ్బంది, ఉద్యోగుల వైఖరిపై విమర్శల వెల్లువ

మహదేవపూర్, ఫిబ్రవరి 16: కాళేశ్వరం.. ఎంతో విశిష్ట కలిగిన ఆలయం. దక్షిణ భారతదేశంలో ఎంతో ప్రసిద్ధి గాంచిన శైవక్షేత్రం ఇది. ఉత్తర భారతంలో ముక్తి ప్రదాయినిగా కాశీకి ఎంత పేరుందో.. ఇక్కడి కాళేశ్వరాలయానికి అంతే ఉంది. మూడు నదుల సంగమంగా, త్రిలింగ క్షేత్రంగా పేరు ఉంది. స్కంధ పురాణం, పలు ఇతిహాసాల్లోనూ కాళేశ్వరం ప్రస్తావన ఉంది. త్రేతాయుగంలో రావణుడిని రాముడు సంహరించిన అనంతరం బ్రహ్మహత్యాపాపాన్ని ప్రక్షాళన చేసేందుకు పలు ప్రాంతాల్లో శివలింగాలను ప్రతిష్ఠించారని పురాణాలు చెబుతున్నాయి. లంక నుంచి అయోధ్యకు వెళ్లే సమయంలో కాళేశ్వరంలో కూడా లింగ ప్రతిష్ఠ చేశారని భక్తులు నమ్ముతారు. పూర్వకాలంలో అనేక మంది రాజులు, మంత్రులు కాళేశ్వరం చేరుకొని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి సేవలో తరించారని చరిత్ర చెబుతోంది. ఇంత వైభవం కలిగిన ఈ పుణ్యక్షేత్రంలో ప్రస్తుతం ఇష్టారాజ్యం కొనసాగుతోందనే విమర్శలు వస్తున్నాయి. ఆలయ నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని భక్తులు అంటున్నారు. కాళేశ్వరాలయానికి తెలంగాణ నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. దీంతో స్వామి వారి ఆదాయానికి కొదవ ఉండదు. హుండీ, వివిధ పూజలు, ప్రసాద విక్రయం, కానుకలు, విరాళాల ఇలా.. ప్రతి ఏడాది రూ. 5 కోట్లకు పైగా భక్తులు సమర్పిస్తుంటారు. అయినా ఆలయ ఆలనపాలన కరువైంది. నిర్వాహకులు సరైన సౌకర్యాలు కల్పించడం లేదని భక్తులు మండిపడుతున్నారు. ఆలయానికి గ్రేడ్-1 అధికారిని ఈవోగా ఏడాదిన్నర క్రితమే కేటాయించారు. అయినా నిర్వహణ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ప్రస్తుత ఈవో స్థానికంగా ఉండకపోవడం, జిల్లా కేంద్రంలో నివసించడంతో పర్యవేక్షణ కరువైంది. దీంతో ఉద్యోగులు, అర్చకులు, సిబ్బంది ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.



శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయం

తూతూమంత్రంగా విధులు

ఆలయ ఉన్నతాధికారి స్థానికంగా ఉండకపోవడంతో కింది కొందరు ఉద్యోగులు, అర్చకులు, సిబ్బంది విధులకు సకాలంలో హాజరు కావడం లేదని తెలుస్తోంది. సకాలంలో హాజరైన వారు సైతం విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఆలయానికి రావడం, హాజరు వేసుకోవడం, మళ్లీ బయటకు వెళ్లిపోయి వ్యక్తిగత పనులు చూసుకోవడం పరిపాటిగా మారిందని భక్తులు అంటున్నారు.

భక్తుల పట్ల అమర్యాద

కాళేశ్వరాలయంలో పలువురు ఉద్యోగులు భక్తుల పట్ల మర్యాద లేకుండా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఇలాంటి అనేక సంఘటనలు జరిగాయి. తమ పట్ల అమర్యాదగా వ్యవహరించారంటూ పలువురు ఉద్యోగులపై అధికారులకు భక్తులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ఉద్యోగులను అధికారులు మందలించిన సందర్భాలు ఉన్నాయి. ఇటీవల ఇద్దరు అర్చకులు రాత్రి సమయంలో అనుబంధ ఆలయానికి తాళం వేయలేదనే ఫిర్యాదు కూడా అధికారులకు స్థానికుల ద్వారా అందింది. ఈ నేపథ్యంలో ఆ అర్చకులను అధికారులు మందలించారు. అయినా వారిలో మార్పు రాకపోవడంతో వారిని కొన్నిరోజులుగా డ్యూటీలకు దూరంగా ఉంచారు. ఈ నేపథ్యంలో ఇద్దరు అర్చకులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఈవో కోరారు.

అర్చకుల కొరత

కాళేశ్వరాలయంలో నిరంతరం పూజలు జరుగుతుంటాయి. మంగళ, గురువారాల్లో కాలసర్పదోష నివారణ పూజలు, శనివారం నవగ్రహ పూజలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతుంటారు. అర్చకులు, సిబ్బంది సంఖ్య పరిమితంగా ఉండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆలయానికి ఐదుగురు అర్చకులను, నలుగురు సిబ్బందిని పెంచితే సౌకర్యవంతంగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉన్నతాధికారులకు నివేదిక పంపాం : ఈవో మహేశ్

భక్తుల పట్ల అమర్యాదగా వ్యవహరించారని గతంలో ఇద్దరు అర్చకులపై ఆరోపణలు రాగా వారిని మందలించాం. అయినప్పటికీ వారి ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోవడంతో చర్యలు తీసుకోవాలని అధికారులకు నివేదించాం. ప్రస్తుతం వారికి ఎలాంటి డ్యూటీలను కేటాయించడం లేదు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

వరంగల్ లీగల్, ఫిబ్రవరి 16 : వివాహేతర సంబంధం ఉన్నదనే అనుమానంతో భార్యను వేధింపులకు గురి చేసి హత్యకు పాల్పడిన ఎమ్డీ అయూబ్ ఖాన్ అనే కానిస్టేబుల్‌కు యావజ్జీవ కారాగార శిక్షా , రూ. 10 వేలు జరిమానా విధి స్తూ వరంగల్ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి కేకా రాధాదేవి శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు వివ రాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా కేంద్రం అశోక్ నగర్‌కు చెందిన తస్మీన్ సుల్తా నాను వరంగల్ జిల్లా పెన్షన్‌పుర గ్రామానికి చెందిన ఎమ్డీ అయూబ్ ఖాన్‌కు ఇచ్చి 2006 సంవ త్సరంలో వివాహం జరిపించారు. ప్రస్తుతం ఆయూబ్ ఖాన్ రఘునాథపెల్లి పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తు న్నాడు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, 2019 నుంచి భార్య ప్రవర్తనను అనుమానిస్తూ వివా హేతర సంబంధం కొనసాగిస్తుందన్న నేపంతో శారీరకంగా, మానసికంగా వేధిస్తుం డేవాడు. ఎన్నిసార్లు అత్తింటివారు సర్ది చెప్పినా నిందితు డిలో మార్పు రాలేదు. ఈ క్రమంలో 2020 జూన్ 5న తస్మీన్ సుల్తానా తన అన్న సాదిక్ హుస్సేన్‌కు ఫోన్‌చేసి ఎప్పటిలాగా తనను అనుమానిస్తూ వేధిస్తున్నాడని చెప్పింది. తన తల్లిద ండ్రులను అదే రోజు చెల్లెల్లి అత్తగారింటికి పంపించి మరునాడు జూన్ 6న సాయంత్రం సాదిక్ హుస్సేన్ చెల్లెలి ఇంటికి వెళ్లాడు. అక్కడే ఉన్న తల్లిదండ్రులతో విషయం తెలుసుకోగా తస్మీన్ సుల్తానాను నిందితుడు బయటకు తీసుకెళ్లా డని తెలిపారు.విషయంపై విచారిం చగా మామునూరు క్యాంపులోని పాత క్వార్టర్స్‌లో తన చెల్లె కనిపించిందని ముఖంపై గాయాలతో, గొంతు బిగించి మృతి చెంది ఉంది. దీంతో తన చెల్లెలు తస్మీన్ సుల్తాన్‌ను నింది తుడు అనుమా నంతో చంపాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు స్వీరించిన మాము నూరు పోలీసులు నిందితుడిపై హత్యానేరం నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున ఎమ్డీ అయుబ్‌ఖాన్‌కు జీవిత ఖైదు, రూ . 10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ ఆజ్మీరా సాంబూ నాయక్ సాక్షులను ప్రవేశ పెట్టగా లైజనింగ్ అధికారిగా ఎం. వెంకటస్వామి, దర్యాప్తు అధికారిగా అప్పటి సీఐ సార్ల రాజు వ్యవహ రించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ కేసు వాదించారు.

ఎంజీఎంలో అనుమానాస్పద వ్యక్తులు..

దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

హనుమకొండ అర్బన్, ఫిబ్రవరి 16: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో కలకలం రేగింది. గురువారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు ఎంజీఎం ఆస్పత్రిలోని పిల్లల వార్డుకు చేరుకున్నారు. మా అమ్మాయి కనిపించడం లేదంటూ వార్డులోని ఎన్ఐసీయూకు వెళ్లారు. అక్కడ అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో సెక్యూరిటీ గార్డులు అక్కడకు చేరుకొని వారిని ఆస్పత్రికి బయటకు పంపించారు. కాగా,, రాత్రి 11 గంటల ప్రాంతంలో మరోసారి పిల్లల వార్డు ముందు తిరుగు తూ కనిపించారు. దీంతో అనుమానం వచ్చిన స్థానికులు వారిని చితకబాది పోలీసులకు అప్పగించారు. ఆడ, మగ వ్యక్తులు అనుమానాస్పదంగా ఎంజీఎంలో పిల్లల వార్డు సమీపం లో తిరుగుతున్నారని పోలీసులు చెప్పారు. పూర్తి వివరాలు రాబడుతున్నట్లు మట్టెవాడ పోలీసులు తెలిపారు.

భూపాలపల్లిలో పిల్లలను ఎత్తుకెళ్లేందుకు వచ్చాడని...

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఫిబ్రవరి 16: పిల్లలను ఎత్తుకెళ్లే వారు సంచరిస్తున్నారనే వందతులు వ్యాపించిన నేపథ్యంలో ఓ వ్యక్తిని కాలనీవాసులు పట్టుకొని తాళ్లతో కట్టి చితకబాదారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన భూపాలపల్లి పట్టణంలోని ఎల్‌బీనగర్‌లో చోటుచేసుకుంది. కాలనీలో ఇద్దరు వ్యక్తులు శుక్రవారం తెల్లవారు జాముున సంచరిస్తుండగా స్థానికుడు ఒకరు గమనించాడు. వెంటనే చుట్టుపక్కల వారిని పిలిచి విషయం చెప్పాడు. దీంతో అప్రమత్తమైన కాలనీవాసులు ఆ ఇద్దరు వ్యక్తులను పట్టుకునేందుకు యత్నించారు. వీరిలో ఒకరు ద్విచక్రవానంపై పరారు కాగా మరొకరు కాలనీవాసులకు పట్టుబడ్డాడు. దీంతో అతడిని తాళ్లతో కట్టేసి పోలీసులకు అప్పగించారు. ఆ వ్యక్తి వరంగల్‌కు చెందిన వాడని తమ విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. అతడి పేరు రాజు అని, తాను పందులు పట్టేందుకే వచ్చానని తమకు చెప్పాడని పేర్కొన్నారు.

దూరవిద్య డిగ్రీ, పీజీ కోర్సుల ఫీజు చెల్లింపు గడువు 15

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 16 : కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం అందిస్తున్న డిగ్రీ కోర్సుల ద్వితీయ, తృతీయ సంవత్సరంతో పాటు పీజీ రెండోవ ఏడాది పరీక్ష ఫీజులను మార్చి 15 వరకు అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం,(జనరల్, కంప్యూటర్) బీబీఏ, బీఎస్సీతో పాటు పీజీ రెండోవ ఏడాది కోర్సుల విద్యార్థుల తమ పరీక్షల ఫలితాల కోసం వేచిచూడకుండా కోర్సుల ఫీజులు చెల్లించుకుని స్టడీ మెటీరియల్ పొందాలని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ 0870-2461480, 2461490లో సంప్రదించాలని డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం తెలిపారు. ఇదిలా ఉండగా దూరవిద్య కేంద్రం అందిస్తున్న ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ మొదటి ఏడాది పూర్తైన అభ్యర్థులందరూ రెండో ఏడాదికి కోర్సు ఫీజులను ఎలాంటి అపరాధ రుసుం లేకండా మార్చి 15 వరకు చెల్లించుకోవాలని డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం వెల్లడించారు.

లంసం, క్యాజువల్

ఉద్యోగులకు న్యాయం చేయాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కచ్చకాయల చిరంజీవి



సమ్మెలో ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు కచ్చకాయల చిరంజీవి

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 16 : కేయూలో పనిచేస్తున్న లంసం, క్యాజువల్ ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలో అప్‌గ్రేడ్ చేసి న్యాయం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కచ్చకాయల చిరంజీవి డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా శుక్రవారం జరిగిన ఉద్యోగుల సార్వత్రిక సమ్మెను పురస్కరించుకుని సీఐటీయూ ఆధ్వర్యంలో కేయూ పరిపాలన భవనం ఎదుట నిరసన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కచ్చకాయల చిరంజీవి ఆందోళనలో పాల్గొని మాట్లాడారు. కేయూలో తాత్కాలిక ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలోకి అప్‌గ్రేడ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించి న్యాయం చేయాలని అన్నారు. అనంతరం కేయూ సీఐటీయూ నాయకులు కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్‌ను కలిసి వర్సిటీ ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రాన్ని అందచేశారు. సానుకూలంగా స్పందించి 4 రోజుల్లో ఉద్యోగులతో భేటీ నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్షుడు ఆకుతోట రాంచందర్, కార్యదర్శి దేశిని రవికుమార్, ఉపాధ్యక్షుడు పల్లం రాజు, మధు, ట్రెజరర్ ఎం.రాజేందర్, సందీప్, కృష్ణ, శోభ. లక్ష్మి, రాణి, సరోజన తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నుంచి రూ.3కోట్లు

మేడారం జాతరకు కేటాయిస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరంగల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడారం మహాజాతరపై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించింది. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' మెయిన్‌లో 'మేడారం జాతరకు కేంద్రం మొండి చేయి.. తెలంగాణ కుంభమేళాకు పైసా ఇవ్వని మోదీ సర్కార్' అనే కథనానికి కేంద్ర ప్రభుత్వం స్పందించింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఈ మేరకు ప్రకటన చేశారు. మేడారం మహాజాతరకు కేంద్ర ప్రభుత్వం రూ.3 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిధులతో మహాజాతరలో భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు వెచ్చించనున్నట్లు వెల్లడించారు. కాగా, 2020 జాతరకు కేంద్ర ప్రభుత్వం రూ.6.10 కోట్లు ఇవ్వగా, 2022 జాతరకు రూ.2.50 కోట్లు మాత్రమే ఇచ్చింది. తాజాగా కిషన్‌రెడ్డి రూ.3 కోట్లు ఇస్తామని ప్రకటించటంతో భక్తుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం జాతర జరగనుంది. ఇందు కోసం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.110 కోట్లు కేటాయించింది.

మేడారానికి ప్రత్యేక రైళ్లు

21నుంచి నడపనున్నట్టు రైల్వే శాఖ వెల్లడి

గిర్మాజీపేట (వరంగల్), ఫిబ్రవరి 16 : ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు జరిగే మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు దక్షిణమధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడపనుంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది భక్తులు హాజరయ్యే ఈ జాతరకు సికింద్రాబాద్, నిజామాబాద్‌ల నుంచి వరంగల్ వరకు ప్రత్యేక రైళ్లు నడుస్తాయని దక్షిణమధ్య రైల్వే శుక్రవారం రాత్రి ప్రకటించింది.

సికింద్రాబాద్ నుంచి..

మేడారం మహాజాతర ప్రత్యేక రైలు సికింద్రాబాద్‌లో ప్రతి రోజు ఉదయం 9.52 గంటలకు బయలుదేరి కాజీపేటకు మధ్యాహ్నం 12.12 గంటలకు, వరంగల్‌కు ఒంటిగంటకు చేరుకుంటుంది. తిరిగి అదే మధ్యాహ్నం 1.55 గంటలకు వరంగల్‌లో బయలుదేరి కాజీపేట మీదుగా సాయంత్రం 6.20 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ ప్రత్యేక మేడారం రైలు మౌలాలి, చర్లపల్లి, ఘట్‌కేసర్, బీబీనగర్, భువనగిరి, యాదగిరి, వంగపల్లి, ఆలేరు, పెంబర్తి, జనగామ, రఘునాథపల్లి, స్టేషన్ ఘన్‌పూర్, పెండ్యాల్, కాజీపేటలో ఆగుతుంది. ఈ నెల 21 నుంచి 25 వరకు ప్రతి రోజు ఈ ప్రత్యేక రైలు సికింద్రాబాద్-వరంగల్ మధ్య నడుస్తుంది.

నిజామాబాద్ నుంచి..

నిజామాబాద్ నుంచి మేడారం ప్రత్యేక రైలు ఈ నెల 21 నుంచి 24 వరకు సికింద్రాబాద్ మీదుగా కాజీపేట, వరంగల్ వరకు నడుస్తుంది. ఈ నాలుగు రోజుల్లో మేడారం ప్రత్యేక రైలు ప్రతీ రోజు ఉదయం 7.05 గంటలకు నిజామాబాద్‌లో బయలుదేరి సికింద్రాబాద్‌కు 11 గంటలకు చేరుకుంటుంది. సికింద్రాబాద్ నుంచి ఉదయం 11.10 గంటలకు బయలుదేరి కాజీపేటకు మధ్యాహ్నం 1.15 గంటలకు, వరంగల్‌కు 1.45 గంటలకు చేరుకుంటుంది. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు వరంగల్‌లో బయలుదేరి 3.15కు కాజీపేటకు చేరుకుంటుంది. కాజీపేట నుంచి మధ్యాహ్నం 3.20 గంటలకు బయలుదేరి సాయంత్రం 4 గంటలకు జనగామ, సాయంత్రం 5.30 గంటకు సికింద్రాబాద్‌కు, రాత్రి 10.30 గంటలకు నిజామాబాద్‌కు చేరుకుంటుంది. నిజామాబాద్ నుంచి వరంగల్‌కు నడిచే ఈ ప్రత్యేక రైలు కామారెడ్డి, అకన్నపేట, మిర్జాపల్లి, వాడిరాం, మనోహరాబాద్, మేడ్చల్, బొల్లారం, మల్కాజిగిరి, సికింద్రాబాద్, చర్లపల్లి, ఘట్‌కేసర్, బీబీనగర్, భువనగిరి, వంగపల్లి, ఆలేరు, జనగామ, రఘునాథపల్లి, స్టేషన్ ఘనపూర్, పెండ్యాల్, కాజీపేట స్టేషన్లలో ఆగుతుంది. ఈ ప్రత్యేక రైళ్ల ద్వారా వచ్చే భక్తులు కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్‌ల వద్ద ఏర్పాటు చేసిన మేడారం బస్‌స్టేషన్‌ల నుంచి ఆర్టీసీ బస్సుల ద్వారా మేడారం వెళ్లేందుకు జిల్లా అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు


కమాండ్ కంట్రోల్ ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మేడారం, ఫిబ్రవరి 16: మహాజాతరలో భక్తుల సౌకర్యార్థం మేడారంలో పోలీస్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. పోలీస్ కమాండ్ కంట్రోల్‌లో దీనిని ఏర్పాటు చేయగా కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం ప్రారంభించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా టోల్ ఫ్రీ నంబరు 18004250620 అందుబాటులో ఉంటుందని క తెలిపారు. జాతర పరిసరాల్లో మొత్తం 382 సీసీ కెమారాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామని అన్నారు. భక్తుల భద్రతా దృష్ట్యా జాతరలో ఎనిమిది జోన్లుగా 42 సెక్టార్లుగా విభజించి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్రీజ, వేణుగోపాల్, జిల్లా ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ పాల్గొన్నారు.

మహాజాతరకు ఆర్టీసీ రెడీ

రేపటి నుంచి ప్రత్యేక బస్సులు - 6వేల బస్సుల్లో 35 లక్షల మంది భక్తుల తరలింపే లక్ష్యం - మేడారంలో 55ఎకరాల్లో తాత్కాలిక బస్‌స్టేషన్ ఏర్పాటు



మేడారంలో భక్తుల కోసం సిద్ధంగా ఉన్న తాత్కాలిక బస్టాండ్

సుబేదారి, ఫిబ్రవరి 16 : మేడారం మహాజాతరకు భక్తులను తరలించేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. రాష్ట్ర నలుమూలల నుంచి ఆరు వేల బస్సుల ద్వారా 35లక్షల మంది భక్తులను తల్లుల చెంతకు చేర్చాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే జాతర రోజుల్లో భక్తుల రద్దీకి తగ్గట్టుగా బస్సుల సంఖ్య పెంచుతూ ఆదాయాన్ని పెంచుకునే దిశగా ఆర్టీసీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇక ఆదివారం నుంచి మేడారానికి బస్సు సర్వీసులను ప్రారంభించనున్న అధికారులు మేడారంలో 55 ఎకరాల్లో తాత్కాలికంగా ఆర్టీసీ ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ జిల్లాలు, ప్రాంతాల వారీగా క్యూలైన్లు, పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. అలాగే బస్సుల మరమ్మతులకు షెడ్లు, ఆర్టీసీ సిబ్బంది, కార్మికులు, అధికారులకు వసతి షెడ్లు, తాగునీటి, మరుగుదొడ్లు, ప్రయాణికుల కోసం విశ్రాంతి షెడ్లను నిర్మించారు. ఆర్టీసీ ఉద్యోగుల కోసం అత్యవసర వైద్య సేవలను అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. గద్దెల వరకు భక్తులను చేర్చేలా ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. బస్సుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు భక్తులకు తెలియజేసేందుకు భారీ ఎల్‌ఈడీ స్ర్కీన్లను జాతరలోని ముఖ్య ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్‌శాఖకు అనుసంధానం చేస్తున్నారు. జాతర కోసం 6 వేల ఆర్టీసీ బస్సులను సిద్ధం చేయగా వాటిలో వరంగల్ రీజియన్ నుంచే సుమారు 2500 బస్సులను నడపనున్నారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి, నల్గొండ, ఖమ్మం జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుంచి కూడా బస్సులను నడిపించేందకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మొత్తం 12,300 మంది ఆర్టీసీ సిబ్బంది విధుల్లో ఉండనుండగా మరో 500 మంది అధికారులు సేవలను పర్యవేక్షించనున్నారు.

ఫ్రీ టిక్కెట్‌తో పెరగనున్న మహిళా భక్తుల సంఖ్య

నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. ఈ క్రమంలోనే ఈసారి మేడారం వెళ్లే మహిళా భక్తులకు కూడా ఉచిత ప్రయాణ అవకాశం ఇస్తున్నట్టు ప్రకటించడంతో జాతరకు మహిళల సంఖ్య అధికంగా ఉండే అవకాశం ఉంది. దీంతో ఆర్టీసీకి మహిళా ప్రయాణికుల ద్వారా లాభం చేకూరుతుందని అంచనా వేస్తున్నారు.

భక్తులకు ఆర్టీసీ సేవలు విస్తృతం

జాతరకు వచ్చే భక్తులు ఎక్కువమంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకే ఆసక్తి చూపుతున్నారు. ప్రతీజాతరకు ఆర్టీసీ తన సేవలను విస్తృతం చేస్తోంది. 1996లో మేడారం జాతరను రాష్ట్ర పండగగా ప్రభుత్వం గుర్తించినప్పటి నుంచి ఆర్టీసీ సేవలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. అయితే ప్రధానంగా 2008 నుంచి ఆర్టీసీ సేవలు విస్తృతమయ్యాయి. 2008లో 2,688 బస్సులను నడిపి 12 లక్షల మంది భక్తులను ఆర్టీసీ చేరవేసింది. 2010లో 3వేల బస్సుల ద్వారా 14లక్షల మందిని, 2012లో 3,100 బస్సుల ద్వారా 14లక్షల మంది భక్తులను తమ గమ్య స్థానాలకు ఆర్టీసీ చేరవేసింది. ఇక 2014లో 3,160 బస్సుల ద్వారా 14లక్షల మంది భక్తులను, 2016లో 3,382 బస్సుల ద్వారా 14లక్షల మంది భక్తులను ఆర్టీసీ చేరవేసింది. ఇక గత 2018 మహజాతరలో 4వేల బస్సులతో 18లక్షల మంది భక్తులను తరలించారు. అయితే 2018లో రాష్ట్ర వ్యాప్తంగా 3,565 బస్సులతో 41వేల ట్రిప్పుల ద్వారా 18లక్షల మందిని తరలించగా, 2020 మహాజాతరలో 3,860 బస్సుల ద్వారా 45వేల ట్రిప్పులను నడిపి 19లక్షల మంది భక్తులను గమ్య స్థానాలకు చేర్చారు. 2022 జాతరలో 3,845 బస్సుల ద్వారా 21లక్షల మంది భక్తులను జాతరకు తరలించారు. ప్రస్తుతం 6వేల బస్సుల ద్వారా భక్తులను జారతకు చేర్చేందుకు ఆర్టీసీ సిద్ధమయింది. ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా 100కు పైగా బస్సు పాయింట్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది.

భక్తులు సహకరించాలి

జె.శ్రీలత, ఆర్టీసీ ఆర్ఎం, వరంగల్ రీజియన్



మేడారంకు వచ్చే భక్తులు ఆర్టీసీ సిబ్బందికి సహకరించాలి. గత జాతర కంటే అధికంగా భక్తులను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులు ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షితంగా ప్రయాణించాలి. ఈ నెల 18 నుంచి మేడారానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఉచితంగా బస్సుసౌకర్యం కల్పించడంతో ఈ సారి ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

గత జాతరల్లో భక్తులకు అందించిన సేవలు

ఏడాది	బస్సులు	ప్రయాణికులు
2008	2,688	12లక్షలు
2010	3,000	14లక్షలు
2012	3,100	14లక్షలు
2014	3,160	14లక్షలు
2016	3,382	14లక్షలు
2018	3,565	18లక్షలు
2020	3,860	19లక్షలు
2022	3,845	21లక్షలు

జాతరపై సాంకేతిక పర్యవేక్షణ

ట్రాఫిక్, భక్తుల రద్దీ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు

సాఫ్ట్‌వేర్ వినియోగం, సీసీ కెమెరాల ఏర్పాటు

వివిధ ప్రాంతాల సమాచారంతో ప్రత్యేక యాప్ రూపకల్పన

భూపాలపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : గిరిజన కుంభమేళాగా గుర్తింపు పొందిన మేడారం జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలో అత్యంత ముఖ్యమైన ట్రాఫిక్, భక్తుల రద్దీ నియంత్రణ, పోలీసు నిఘాపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ అంశాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సాంకేతికతకను వినియోగిస్తోంది. ప్రధానంగా రద్దీ నియంత్రణ కోసం జాతరలో ఎంపిక చేసిన కీలక ప్రాంతాల్లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో కూడిన కెమెరాలను ఏర్పాటు చేసి.. వీటిని కంట్రోల్ రూంకు అనుసంధానించి వీటి ద్వారా చదరపు మీటరులో నలుగురికంటే ఎక్కువ మంది గుమిగూడిన ప్రాంతాలను గుర్తించి, రద్దీ నియంత్రణ చర్యలు చేపట్టనున్నారు. అలాగే భక్తుల సంఖ్యను లెక్కించే క్రౌడ్ కౌంటింగ్ కెమెరాలు, వాహనాల సంఖ్యను అంచనా వేసేందుకు నెంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. మేడారం క్షేత్రంలోని ప్రధాన మార్గాలు, కూడళ్లు, గద్దెల ప్రాంగణం, పార్కింగ్ స్థలాల్లో మొత్తం 500కు పైగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. కంట్రోల్ రూంకు అనుసంధానమై ఉండే వీటి ద్వారా 24గంటల నిఘా ఉండేలా చూస్తారు. నిఘాను మరింత పటిష్ఠం చేసేందుకు గాను డ్రోన్ కెమెరాలను కూడా వినియోగించనున్నారు. ఇక వీటి నిర్వహణకు నిపుణులైన సిబ్బంది సహకారం తీసుకుని.. ఆయా ప్రాంతాలపై దృష్టి పెట్టనున్నారు.

జాతర వివరాల ప్రత్యక్ష ప్రసారానికి ఎల్‌ఈడీ తెరలు

మేడారంలోని పలు ప్రాంతాల్లో ఎల్‌ఈడీ తెరలను ఏర్పాటు చేసి జాతర వివరాలు, విశేషాలు, తప్పిపోయిన వారి వివరాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. వాహనాల పార్కింగ్ కోసం 1400 ఎకరాల మేర విస్తరించి ఉన్న 33 పార్కింగ్ స్థలాలను అందుబాటులోకి తేనుండగా..


భక్తుల కోసం ఆర్టీసీ ఆరు వేల బస్సులను నడపాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ట్రాఫిక్ ఎలాంటి ఆటంకాలు లేకుండా నియంత్రణ పకడ్బందీగా జరిగేలా ఇప్పటికే వలంటీర్లు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

అధికారులు అంకితభావంతో పనిచేయాలి

ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్

మేడారం, ఫిబ్రవరి 16: మేడారం జాతరలో విధులు నిర్వర్తిస్తున్నమన అధికారులు అంకితభావంతో పనిచేయాలని ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్ అన్నారు. మరో నాలుగు రోజుల్లో మహాజాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో సెక్టోరియల్ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. మేడారంలోని గిరిజన బాలిక ఇంగ్లిష్ ఆశ్రమ పాఠశాలలో సెక్టోరియల్ అధికారులకు నిర్వహిస్తున్న రెండో విడత శిక్షణ కార్యక్రమంలో పీవో మాట్లాడారు. మహాజాతర విధుల్లో పాల్గొనే అధికారులు ఈనెల 19న రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిబద్ధతతో పనిచేసి మహాజాతరను విజయవంతం చేయాలన్నారు. జంపన్నవాగు వద్ద విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం ఏమరపాటుగా ఉండొద్దని అన్నారు. జాతర పరిసరాల్లో ఆర్‌అండ్‌బీ అధికారులు సూచిక బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. జన సమూహంలో నిరంతరంగా పారిశుధ్య నిర్వహణ చేపట్టాలన్నారు.

పరిసరాల్లో దుర్వాసన రాకుండా ఎప్పటికప్పుడు రసాయనాలతో శుభ్రం చేస్తుండాలన్నారు. భక్తుల ఆరోగ్యాన్ని కాపాడాలని, అవసరమైతే తక్షణమే వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు సెక్టార్ల వారీగా సిబ్బందికి విధులు అప్పగించాలన్నారు. జాతరలో ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. పేపర్, క్లాత్, జూట్ బ్యాగులను మాత్రమే భక్తులు వినియోగించేలా చూడాలన్నారు. ప్లాస్టిక్ ఫ్రీ జాతరగా జరుపుకోవాలనే సందేశం ప్రతి ఒక్కరికీ తెలియాలని సూచించారు. గద్దెల వద్ద విధులు నిర్వహించే అధికారులు సమన్వయంగా పనిచేయాలన్నారు. భక్తుల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ వెంకన్న, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, ఐటీడీఏ ఏపీవో వసంతరావు పాల్గొన్నారు.



సెక్టార్ అధికారులతో మాట్లాడుతున్న పీవో అంకిత్


మేడారంలోని తల్లుల గద్దెల వద్ద భక్తుల కోలాహలం


బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కింద స్నానాలచరిస్తున్న భక్తులు


బంగారాన్ని తల్లులకు సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు


జంపన్న వాగులో స్నానమాచరిస్తున్న భక్తులు

నేడు కేయూకు నిజనిర్ధారణ కమిటీ

వర్సిటీ అధికారులు, విద్యార్థులతో ముఖాముఖీ

కమిటీ రాకతో వర్సిటీలో సర్వత్రా ఉత్కంఠ

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 16 : కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో అక్రమాలు జరిగాయంటూ విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో రాష్ట్ర ఉన్నతా విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వి.వెంకటరమణ నేతృత్వంలో త్రిసభ్య కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియామించింది. ఈ మేరకు శనివారం కాకతీయ యూనివర్సిటీకి త్రిసభ్య కమిటీపీహెచ్‌డీ అడ్మిషన్లపై నిజనిర్ధారణకు రానుంది. ఈ మేరకు వర్సిటీ ఉన్నతాధికారులకు నిజానిర్ధారణ కమిటీ పర్యటన వివరాలను లేఖలో వర్సిటీకి తమ పర్యటన షెడ్యూల్‌ను అధికారికంగా తెలియజేసింది.

ఫిబ్రవరి 17 ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల వరకు వీసీతో ప్రాథమిక చర్చలు, 11.15- 12.15 వరకు పీహెచ్‌డీ అడ్మిషన్ల సంబంధిత అధికారులతో చర్చలు, 12.30 నుంచి 1.15 వరకు, 2.15 3.30 రెండు దఫాలుగా విద్యార్థుల నుంచి పీహెచ్‌డీ-2 అడ్మిషన్లలో చోటుచేసుకున్న పరిణామాలు, విద్యార్థుల అభ్యంతరాలను వినతి పత్రాల ద్వారా నిజా నిర్ధారణ కమిటీ స్వీకరిస్తోంది. సాయంత్రం 3.45 గంటల నుంచి 4 గంటల వరకు నిజానిర్ధారణ కమిటీ సేకరించిన వివరాలను సమ్ అప్ చేసి పర్యటన ముగిస్తారు. కాగా, కమిటీలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. వెంకటరమణ పీహెచ్‌డీ నిజానిర్ధారణ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించగా ఆయనతో పాటు మరో ఓయూ జియాలజీ విభాగం ప్రొఫెసర్ పాండురంగారెడ్డి, టెక్నికల్ ఎడ్యుకేషన్ జాయింట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు రానున్నారు. పీహెచ్‌డీ అడ్మిషన్లపై రాష్ట్ర ప్రభుత్వం కల్పించుకుని వర్సిటీ చరిత్రలో మొదటి దఫా నిజానిర్ధారణ కమిటీ వేసి విచారణ జరిపించడం పట్ల సర్వత్రా చర్చనీయంగా మారింది. నిజానిర్ధారణ కమిటీ రిపోర్టు పీహెచ్‌డీ అడ్మిషన్ల లోగుట్టును బట్టబయలు చేయనుందని వర్సిటీలో చర్చలు జోరందుకున్నాయి.

అజర ఆస్పత్రిలో పునరావాస కేంద్రం ప్రారంభం


ప్రారంభిస్తున్న డాక్టర్ కాళీప్రసాద్

హనుమకొండ అర్బన్, ఫిబ్రవరి 16 : హనుమకొండ ములుగురోడ్‌లోని అజర హాస్పిటల్‌లో ఫిజియోథెరపీ, పునరావాస కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఇకపై హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లకుండా ఇక్కడే అజర హాస్పిటల్‌లో తక్కువ ఖర్చుతో అత్యాధునిక వైద్యం పొందవచ్చని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బండారు శివసుబ్రమణ్యం తెలిపారు. అత్యాధునికమైన యూఎస్ ఇంపోర్టెడ్, ఎలక్ట్రో థెరపీ యూనిట్‌తో వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు దివ్వెల మోహన్‌దాస్, వలపదాసు చంద్రశేఖర్, పగడాల కాళీప్రసాద్, మాగంటి శేషుమాధవ్, కె.నాగార్జునరెడ్డి, ఎమ్డీ.అన్వర్, బి.శ్రీనివాస్, అప్పాల సుధాకర్, పెరుమాండ్ల రామకృష్ణ, వంశీ, హరీష్ పాల్గొన్నారు.

కమిషనరేట్ పరిధిలో సీఐల బదిలీలు

ఉత్తర్వులు జారీచేసిన సీపీ అంబర్ కిశోర్ ఝా

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 16: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఐదుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐతే కొందరు ఒకే చోట ఎక్కువ కాలం పని చేయడం, మరి కొందరిపై కొన్ని ఆరోపణలు రావడంతో స్థానచలనం చేసినట్టు తెలుస్తోంది.

పోస్టింగ్ పొందిన వారు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాలు జారీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ ఐన ప్రదేశం
వై. సుధాకర్‌రెడ్డి	కమిషనరేట్	కాజీపేట
సీహెచ్ శ్రీధర్	కేయూసీ	వీఆర్ (వెకెన్సీ రిజర్వ్) వరంగల్
వి. చేరాలు	వీఆర్ (వెకెన్సీ రిజర్వ్)	వరంగల్ కేయూసీ
డి. రవిరాజు	వీఆర్ (వెకెన్సీ రిజర్వ్)	వరంగల్ పరకాల
ఎం. అబ్బయ్య	పరకాల	సీసీఎస్ వరంగల్

నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 16 : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం, మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రెండు కార్యక్రమాల నిర్వహణకు సంబంధిత అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ.. ఈ నెల 20న జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వరకు వయస్సున్న పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడం జరుగుతుందన్నారు.

జిల్లాలో 2 లక్షల 33వేల 500 మంది పిల్లలకు ఈ మాత్రలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. మార్చి 3వ తేదీన జిల్లాలో 79వేల 227 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌వో వైవి.గణేష్, డీఈవో డాక్టర్ అబ్దుల్ హై, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మదన్ మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యాకూబ్‌పాషా, డీఐఓ డాక్టర్ వాణిశ్రీ, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమాశ్రీ, డాక్టర్ హిమబిందు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

కేంద్ర విధానాలపై నిరసనల వెల్లువ

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 16: కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, సంయుక్త కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకుడు ప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జంపాల రవీందర్, ఎంసీపీఐ జిల్లా నాయకుడు గుండెబోయిన చంద్రయ్య, సీపీఐ నాయకుడు ఎమ్డీ.అంజాద్‌పాషాలు పాల్గొని మాట్లాడారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 44కార్మిక చట్టాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ రద్దుచేసి, నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చి యాజమాన్యాల దోపిడీకి చట్టబద్ధ అవకాశాన్ని కల్పించారని విమర్శించారు. వాటిని రద్దుచేయాలని 13నెలలుగా ఢిల్లీలో రైతులు పోరాడితే చట్టాలను రద్దుచేస్తామని ప్రకటించి ఇచ్చిన హామీలను విస్మరించారని అన్నారు. మోదీ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై ప్రజానీక తిరగబడాలని వారు పిలుపునిచ్చారు. అదేవిధంగా ములుగులోని ఏరియా వైద్యశాలలో తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మిక సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి సమ్మెలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో కార్మిక సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు, కార్మిక సిబ్బంది ముంజాల భిక్షపతి, బండి నర్సయ్య, మంజుల, సరోజన, రాజు, కొమురయ్య, సాంబయ్య, రాజకుమారి, ఈశ్వరి, ఈక మమత, భాస్కర్, సురేష్, వేణునాయక్, అజిత, ఎం.భాస్కర్, రాజు, మహాలక్ష్మి, సంధ్య, రమేష్, కృష్ణ, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

● మంగపేట : మండల కేంద్రంలో ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. నాయబ్ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. సీఐటీయూ ములుగు డివిజన్ గౌరవ అధ్యక్షుడు ఎల్పీ. ముత్యాలు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు సమాన పనికి సమాన వేతనాలు రాష్ట్ర ప్రభుత్వం అందించి, అన్నిరకాల అలవెన్స్‌లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాలలో మంగపేట, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఏటూరునాగారం : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ములుగు జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ. దావూద్ మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలన్నారు. కార్పొరేట్ అనుకూల విధానాలను ప్రతిఘటిస్తూ ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తుమన్నారు. 45వ ఐఎల్‌సీ ప్రకారం ఆశ, అంగన్వాడి, కార్మికులను ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అనందరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంకి వెళ్లి తహసీల్దార్ ఎమ్డీ. కాజామొయినుద్దీన్‌కు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ సభ్యురాలు బొగ్గం సరిత, పి. మాధవి, డి. రాజ్యలక్ష్మి, ఈ. సాంబలక్ష్మి, ఎం. వినోద, ఎమ్డీ. కాసింబి, అంగన్వాడిలు ఎం. నాగలక్ష్మి, ఎన్. లలిత, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్డీ. యాకూబ్, పి. సంపత్‌రావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకుడు నాయిని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ములుగులోని ఏరియా వైద్యశాల ఆవరణలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ ఆస్పత్రులల్లో ఎన్‌హెచ్‌ఎం సంస్థలలో 20 ఏళ్లుగా కాంట్రాక్ట్ బేసిక్‌లో సెక్యూరిటీ గార్ప్ కంప్యూటర్ ఆపరేటర్స్, వైద్య విధనంలో పని చేస్తున్న వారి సమస్యలను పరిష్కరించాలి మండల కేంద్రంలోని సామాజిక ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిరాఅట.. జీవో 510ని వర్తింపజేసి కాంట్రాక్ట్ బేసిక్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిస్టర్స్ మానస, నిర్మల, సుమలత, బ్లడ్ బ్యాంకు సిస్టర్స్ మురళి, సునీల్, లక్ష్మణ్, సుధాకర్, కోటి, విజయ, నరేష్, దేవేందర్, వరలక్ష్మి, రాధి తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల : దేశ వ్యాప్తంగా కార్మికుల పట్ల కేంద్రం నిరంకుశంగా వ్యవహరిస్తోందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి చింతల రజనీకాంత్ విమర్శించారు. సమ్మెలో భాగంగా శుక్రవారం ఆశా కార్యకర్తలు, కార్మికులతో కలిసి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, కార్మికుల వ్యతిరేక చట్టాలతో అన్ని రంగాల ప్రజల సమస్యలను బీజేపీ ప్రభుత్వం విస్మరిస్తోందని ఆరోపించారు. ఈకార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి భూక్య నవీన్, ఆశా కార్యకర్తలు రాధిక, సాయివేద, సుమలత, లక్ష్మి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● మల్హర్ : దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆశా కార్యకర్తల పై పనిభారాన్ని తగ్గించాలని కోరారు.

భూపాలపల్లి డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సంపత్‌రావు



కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఫిబ్రవరి 16: భూపాలపల్లి సబ్ డివిజన్ పోలీస్ అధికారిగా అవిర్నేని సంపత్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంటెలిజెన్స్ విభాగంగా పనిచేస్తున్న అయన బదిలీపై భూపాలపల్లి డీఎస్పీగా వచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ సంపత్‌రావు 2019 నవంబర్ నుంచి 2022 ఏప్రిల్ వరకు ఇదే సబ్ డివిజన్ పోలీస్ అధికారిగా విధులు నిర్వర్తించారు. ఆ సమయంలో ప్రజలకు చేరువయ్యారు. సబ్ డివిజన్‌లోని భూపాలపల్లి, గణపురం, రేగొండ, మొగుళ్లపల్లి, చిట్యాల, టేకుమట్ల మండలాల ప్రజలకు ఆయన సుపరిచితుడు. గతంలో 2020, 2022లో జరిగిన జాతర సమయంలో ఆయన ఇక్కడే విధులు నిర్వర్తించారు. ప్రధానంగా మేడారం దర్శనం పూర్తిచేసుకొని తిరుగు ప్రయాణంలో తన పరిధిలోకి వచ్చే దూదేకులపల్లి, గొల్లబుద్దారం, చింతకాని, కమలాపూర్ గ్రామాల మీదుగా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే మళ్లీ మహాజాతర సమీపిస్తున్న నేపథ్యంలో సంపత్‌రావుకు పోస్టింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. విధుల్లో చేరిన ఆయనను పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

ఎస్‌ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

కాటారం, ఫిబ్రవరి 16: ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 19న పదో తరగతి విద్యార్థులకు నిర్వహించే టాలెంట్‌టెస్ట్ పోస్టర్‌ను మండల కేంద్రంలోని కాటారం జడ్పీహెచ్ఎస్ ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ కాటారం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులకు ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బొడ్డు కిషోర్ తెలిపారు. టాలెంట్ టెస్ట్‌ను ఉత్సాహంతో రాసే విద్యార్థులు తమ అనుభవంతో బోర్డు పరీక్షలు కూడా బాగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులు రమేష్, రజిత, షకీల్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, ఈశ్వర్, అఖిల్ పాల్గొన్నారు.

కులగణన తీర్మానం హర్షణీయం : బీసీ సంఘం

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 16: రాష్ట్రంలో బీసీల కులగణన చేపట్టేందుకు అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేయడం హర్షణీయమని బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బీమనాథుని సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుల గణన చేసిన అనంతరం జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. చేతి వృత్తులు, కుల వృత్తులు చేసుకుంటూ జీవనం కొనసాగించే వారికి రూ. 5లక్షల వడ్డీ లేని రుణం అందించాలని కోరారు.

ప్రవీణ్ కుమార్ అరెస్టు అప్రజాస్వామికం : బీఎస్పీ

కాటారం, ఫిబ్రవరి 16: రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో మతోన్మాద శక్తుల దాడిలో గాయపడ్డ వారిని పరామర్శించడానికి వెళ్తున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు రాజబాబు శుక్రవారం ఓ ప్రకటనలో విమర్శించారు. మతోన్మాదులు దళితులపై ఉద్దేశపూర్వకంగానే దాడులు చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రక్షణ కరువైందని పేర్కొన్నారు.

19న విలాసాగర్‌లో ఇసుక డంపుల వేలం

కాటారం, ఫిబ్రవరి 16: మండలంలోని విలాసాగర్ వద్ద సీజ్ చేసిన ఇసుక డంపులను ఈనెల 19 బహిరంగ వేలం వేయనున్నట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. మానేరు నది నుంచి ఇసుకను తోడి ట్రాక్టర్లతో తెచ్చి అక్రమంగా నిల్వ చేశారని వచ్చిన సమాచారం మేరకు గురువారం రెవెన్యూ, మైనింగ్ అధికారులు పరిశీలించగా పెద్ద ఎత్తున డంపులు కనిపించాయని, వాటిని సీజ్ చేశామని తెలిపారు. సుమారు 390 క్యూబిక్ మీటర్లకు పైగా ఇసుక డంపుల్లో ఉన్నట్లు తేలిందని వాటిని వేలం వేయడానికి చర్యలు చేపట్టామన్నారు. ఆసక్తి కల్గిన వ్యక్తులు వేలంలో పాల్గొనవచ్చని తహసీల్దార్ వెల్లడించారు.

ఐక్యకార్యాచరణ కమిటీ సమ్మె నోటీసు

మంగపేట, ఫిబ్రవరి 16: ఎంపీహెచ్ఏ (ఎఫ్) నోటికేషన్‌ను రద్దు చేయాలని, కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ, ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసనకు దిగారు. నాయబ్ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావుకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ కార్యక్రమంలో బి.చిన్నా, జమునరాణి, ఎం.సీతమ్మ, జె.మమత, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖకు బారికేడ్ల వితరణ


బారికేడ్లను ప్రారంభిస్తున్న ఎస్పీ శబరీశ్

మేడారం, ఫిబ్రవరి 16: మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరను పురస్కరించుకుని ట్రాఫిక్ నియంత్రణ కోసం హైదరాబాద్‌కు చెందిన స్టీల్ పైప్స్ కంపెనీ మహాలక్ష్మి ప్రొఫైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సుమారు రూ. 6లక్షల విలువ గల ఆరు బారికేడ్లు, రూ. 2లక్షల విలువ గల 3 వేల హెచ్చరిక బోర్డులను పోలీస్ శాఖకు వితరణ చేశారు. మేడారం కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద ఎస్పీ శబరీశ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కంపెనీ యాజమాన్యానికి ఎస్పీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, డీఎస్పీ రవీందర్, పస్రా సీఐ శంకర్, ఆర్ఐ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


క్షతగాత్రుడు రాజు

మహదేవపూర్, ఫిబ్రవరి 16: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన సంఘటన మండలంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రాపల్లికోట గ్రామానికి చెందిన బొచ్చు రాజు (26) కాటారం నుంచి మహదేవ పూర్ వైపు బైక్‌పై వస్తుండగా కాళేశ్వరం నుంచి నర్సంపేటకు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో బొచ్చు రాజు తీవ్రంగా గాయపడ్డాడు. కారు డ్రైవ్ చేస్తున్న మచ్చిక రాజు (30) కూడా గాయపడ్డాడు. బైక్ నుజ్జునుజ్జు కాగా కారు కూడా దెబ్బతింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఇద్దరిని మహదేవపూర్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఆస్పత్రికి పంపారు. కారులో ప్రయాణిస్తున్న నలుగురు సురక్షితంగా బయటపడ్డారు.

మహాజాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

భూపాలపల్లి డిపో నుంచి 160 సర్వీసులు

రేపటి నుంచి ప్రారంభం

సేవలు అందించనున్న 430 మంది సిబ్బంది


లక్ష్మీనారాయణ, డిపో మేనేజర్

కాకతీయఖని, ఫిబ్రవరి 16: మేడారం మహాజాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని ఆర్టీసీ భూపాలపల్లి డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ తెలిపారు. మొత్తం 160 సర్వీసులను ఆదివారం నుంచి ప్రారంభిస్తున్నామని చెప్పారు. భూపాలపల్లి, కాటారం, కాళేశ్వరం, మహారాష్ట్రలోని సిరొంచ వద్ద నాలుగు బస్సు పికప్, డ్రాపింగ్ పాయింట్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రాల నుంచి భూపాలపల్లి, గణపురం, జంగాలపల్లి మీదుగా భక్తులను మేడారానికి చేరవేస్తామని తెలిపారు. ఈ బస్సులు సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రాంగణానికి సమీపంలో ప్రయాణికులను సురక్షితంగా చేరవేస్తాయని అన్నారు. భూపాలపల్లి నుంచి మేడారానికి రూ.220 (ఫుల్ టికెట్), రూ.130 (హాఫ్ టికెట్) చార్జీ ఉంటుందని తెలిపారు. కాటారం నుంచి మేడారానికి రూ.260 (ఫుల్), రూ.150 (హాఫ్), కాళేశ్వరం నుంచి మేడారానికి రూ.350 (ఫుల్), రూ.180 (హాఫ్), సిరొంచ నుంచి మేడారానికి రూ.370 (ఫుల్), రూ.200 (హాఫ్) చార్జి ఉంటుందని వివరించారు. మహిళలకు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత ప్రయాణం అందించనున్నట్లు తెలిపారు. ఈ సర్వీసులు 24 గంటలు అందు బాటులో ఉంటాయని అన్నారు. బస్ పాయింట్ల వద్ద టికెట్ తీసుకునే సౌకర్యం ఉంటుందని తెలిపారు. మేడారం విధుల్లో ఆర్టీసీ డ్రైవర్లు 320 మంది, కండక్టర్లు, మెకానిక్‌లు, సూపర్‌వైజర్లు 110 మంది పాల్గొంటారని డీఎం తెలిపారు.

స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా సిరిసిల్ల రాజయ్య



హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 16 : తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా మాజీ ఎంపీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సిరిసిల్ల రాజయ్య నియమితులయ్యారు. చైర్మన్‌తో పాటు ముగ్గురు సభ్యులతో కూడిన కమిషన్‌ను రాష్ట్ర గవర్నర్ డాక్టరు తమిళిసై సౌందర రాజన్ శుక్రవారం అధికారికంగా ప్రకటించారు.

స్టేట్ ఫైనాన్స్ కమిషన్‌గా సిరిసిల్ల రాజయ్య నియమితులు కావడం పట్ల ఆయన సన్నిహితులు, పార్టీ వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. చైర్మన్ రాజయ్యతో పాటు ప్రకటించిన ముగ్గురు సభ్యుల్లో మహబుబాబాద్‌కు చెందిన మాలోతు నెహ్రూనాయక్ ఉన్నారు. మిగతా ఇద్దరిలో వికారాబా ద్‌కు చెందిన మల్కుడ్ రమేశ్, సూర్యాపేటకు చెందిన సంకెపల్లి సుధీర్‌రెడ్డికి చోటు దక్కింది.

పార్లమెంట్ ఆశావహుల రేసు నుంచి పక్కకు

సిరిసిల్ల రాజయ్యకు ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించడంతో ఇక ఆయనకు వరంగల్ పార్లమెంట్ టికెట్ తలుపులు మూసివేసినట్లే అయ్యింది. వరంగల్ పార్లమెంట్ ఆశావహుల్లో ముఖ్యులుగా సిరిసిల్ల రాజయ్య ఉన్నారు. గతంలో ఆయన ఎంపీగా పని చేయడం, టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి పగ్గాలు చేపట్టకు ముందు నుంచే ఆయనకు మద్దతుదారుడిగా ఉండడంతో రేవంత్‌రెడ్డికి కూడా రాజయ్యకు పదవి కల్పన బాధ్యతగా పరిణమించింది. వరంగల్ పార్లమెంట్ టికెట్ రేసులో పోటీ అధికంగా ఉండడం, టికెట్ కేటాయింపు భారమైన తరుణంలో రాజయ్యకు సముచిత స్థానం కల్పించాలనే నిర్ణయంతో రేవంత్‌రెడ్డి స్టేట్ కమిషన్ చైర్మన్‌గా నియమించారనే అంచనాలు జిల్లా పార్టీ వర్గాల్లో నెలకొన్నాయి. రాజయ్యకు నామినేటెడ్ పోస్టు దక్కడంతో పార్లమెంట్ టికెట్ రేసు నుంచి ఒకరు తప్పినట్లైయ్యింది. దీంతో మిగతా ఆశావహులు కూడికలు, తీసివేతల్లో తలమునకలయ్యారు. స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుల్లో ఒకరైన మహబూబాబాద్‌కు చెందిన మాలోతు నెహ్రూ నాయక్ కూడా అసెంబ్లీ టికెట్‌ను ఆశించిన వారే. ఆయనకు కూడా సభ్యుడిగా బాధ్యతలు అప్పగించి న్యాయం చేశారనే అభిప్రాయాలు నెలకొన్నాయి.

కాటారం మార్కెట్ కమిటీ రద్దు

కాటారం, ఫిబ్రవరి 16: కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం రద్దు అయింది. ఈ మేరకు వ్యవసాయ, సహకార మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. చైర్ పర్సన్, వైస్ చైర్మన్, పలువురు డైరెక్టర్లతో కూడిన మార్కెట్ కమిటీ పాలకవర్గం వెంటనే రద్దు చేసి సంబంధిత మార్కెట్ కమిటీ బాధ్యతలు అధికారులు తీసువాలని రెండు రోజుల క్రితమే ఆదేశాలు వెలువడ్డాయి. ఏఎంసీ పాలకవర్గం రద్దు కావడంతో మార్కెటింగ్ శాఖ వరంగల్ జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రసాదరావు కాటారం ఏఎంసీ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో గత ఏడాది ఫిబ్రవరిలో ఏఎంసీ చైర్‌పర్సన్‌గా పెండ్యాల మమత సహా 18 మందితో ఏర్పడిన పాలకవర్గం ఏడాదిలో రద్దయింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జిల్లాలో కొలువుదీరిన మూడు ఏఎంసీ పాలకవర్గాలు రద్దు కావడంతో అధికార కాంగ్రెస్ నేతల్లో నామినేటెడ్ పదవుల కోసం ఆశలు రేకెత్తుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల సమయంలో నేతల పనితీరును బట్టి పదవులు కేటాయించాలని పార్టీ పెద్దలు ఆలోచిస్తున్నట్లు సమాచారం.



కాటారం వ్యవసాయ మార్కెట్ యార్డు

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోలు

వెంకటాపూర్(రామప్ప), ఫిబ్రవరి 16: వెంకటాపూర్ నూతన ఎంపీడీవోగా ఎం.రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రానున్న ఎంపీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న శ్రీనివాస్‌ను బదిలీ చేసింది. ఆయన స్థానంలో పెద్దపల్లి జిల్లాలో పనిచేస్తున్న ఎం.రాజు ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా అధికారులు, కార్యాలయ సిబ్బంది ఆయనకు పూలబొకేలు అందజేసి స్వాగతం పలికారు.

● గోవిందరావుపేట : గోవిందరావుపేట నూతన ఎంపీడీవోగా గార్లపాటి జవహర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడి పనిచేసిన ప్రవీణ్‌కుమార్‌ను ఎన్నికల కమిషన్ ఇటీవల బదిలీ చేయగా ఆయన స్థానంలో జవహర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

శునకానికి ఎత్తుబంగారం


పెంపుడు కుక్కకు ఎత్తుబెల్లం తూకం వేస్తున్న కుటుంబం

చిట్యాల, ఫిబ్రవరి 16: మేడారం మహా జాతరకు వెళ్తున్న ఓ కుటుంబం తమ పెంపుడు కుక్కకు ఎత్తుబంగారం (బెల్లం) తూకం వేయించింది. మండల కేంద్రానికి చెందిన నేపాలి శోభ, వేణు సింగ్ దంపతులు రెండేళ్లుగా శునకాన్ని పెంచుకుంటున్నారు. ఆరు నెలల క్రితం అది తీవ్ర అనారోగ్యానికి గురైందని, కోలుకుంటే మేడారంలో సమర్పించుకుంటామని మొక్కుకున్నామని ఆ దంపతులు తెలిపారు.

క్యాంపునకు తరలిన పీఏసీఎస్ డైరెక్టర్లు

అవిశ్వాసం వీగిపోయేలా చైర్మన్ యత్నాలు!

కాటారం, ఫిబ్రవరి 16: గారెపల్లి(కే)ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం చైర్మన్, వైస్ చైర్మన్లపై జిల్లా సహకార అధికారి శైలజకు గురువారం రాత్రి అవిశ్వాసం లేఖను అందించిన డైరెక్టర్లతో పాటు మరికొందరు డైరెక్టర్లు క్యాంపునకు తరలినట్లు తెలుస్తోంది. చైర్మన్ చల్ల నారాయణరెడ్డి, వైస్ చైర్మన్ దబ్బెట స్వామిలపై అవిశ్వాసం పెడుతున్నట్లు భూపాలపల్లిలో డీసీవోకు లేఖను అందించిన ఏడుగురు డైరెక్టర్లు ఇళ్లకు తిరిగిరాకుండా అటు నుంచి అటే క్యాంపుకు వెళ్లారు. మరికొందరు శుక్రవారం వారితో జాయిన్ అయ్యారు. 13 మంది డైరెక్టర్లు ఉన్న సొసైటీలో అవిశ్వాసం నెగ్గాలంటే 2/3 వంతు మెజారిటీ ఉండాలి. అవిశ్వాసానికి 10 మంది డైరెక్టర్లు మద్దతు ఉందని తెలుస్తుండగా వారిలోని అనైక్యతను వాడుకుని అవిశ్వాసం వీగిపోయేలా చైర్మన్ నారాయణ రెడ్డి యత్నిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు చెందిన పలువురు డైరెక్టర్లు పదవుల కోసం, క్యాంపు ఖర్చుల కోసం తర్జనభర్జనలు పడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో వారి బలహీనత పై దెబ్బ కొట్టడానికి డైరెక్టర్ల బంధువులతో అవిశ్వాసం వీగేలా చర్చిస్తున్నట్లు సమాచారం. కాగా క్యాంపుకు తరలిన డైరెక్టర్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు పనిచేస్తారని, అవిశ్వాసానికి ఎలాంటి ఢోకాలేదని పలువురు కాంగ్రెస్ నేతలు ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా రథసప్తమి పూజలు


కాళేశ్వరంలో పూజల్లో భక్తులు

మహదేవపూర్, ఫిబ్రవరి 16: మండలంలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి అనుబంధ శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం రథ సప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి వారికి ప్రత్యేక అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్, కాళేశ్వరం ఎస్సై భవానీసేన్, కాళేశ్వరం ఎంపీటీసీ రేవెల్లి మమత, ధర్మకర్తలు అడుప సమ్మయ్య, శ్యాంసుందర్ దేవ్డా తదితరులు పాల్గొన్నారు.

కోటంచలో ఆలయంలో..


కోటంచలో స్వామి వారి ఊరేగింపు

రేగొండ: మండలంలోని కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్ర వారం రథసప్తమి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారిని సూర్య వాహనంలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ఈ యాత్రలో పాల్గొని గోవిందనామస్మరణ చేశారు. అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీనివాస్, ఆలయ చైర్మన్ మాదాడి అనిత, ధర్మకర్తలు గండి తిరుపతి, దేవేందర్, గైని కుమారస్వామి, కాంగ్రెస్ నాయకులు ముల్కనూరి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ మండల అధ్యక్షుల నియామకం


సతీష్

మంగపేట, ఫిబ్రవరి 16: బీజేపీ మండల అధ్యక్షుడిగా మండలంలోని తిమ్మంపేటకు చెందిన పల్నాటి సతీష్‌ను ఎంపిక చేశారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం శుక్రవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి పొదెం రవీందర్, సీనియర్ నాయకులు లింగంపల్లి శ్రీనివాసరావు, ఎర్రంగాని వీరన్‌కుమార్, బట్ట రాములు, చిన్నపల్లి రాము, జాడి వెంకట్, కటుకోజు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


రాజశేఖర్

● ఏటూరునాగారం : బీజేపీ మండల అధ్యక్షుడిగా గాడిచర్ల రాజశేఖర్ ఎన్నికయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన పార్టీ పెద్దలకు ఈ సందర్భంగా రాజశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.


మల్లేష్

● వెంకటాపూర్(రామప్ప) : భారతీయ జనతా పార్టీ వెంకటాపూర్ మండల నూతన అధ్యక్షుడిగా పైడాకుల మల్లేష్ ఎంపికయ్యారు. ఈమేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల అధ్యక్ష పదవి కట్టబెట్టేందుకు సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, మండల నాయకులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. మండలంలో పార్టీ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా పాటుపడతానని అన్నారు.